క్లుప్తంగా

వేతనాలు విడుదల చేయాలని వినతి



వైద్యాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మాడుగుల రూరల్: నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు 104 సంచార వైద్య సేవా వాహన సిబ్బంది తెలిపారు. మూడు నెలల జీతాలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదులకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది అల్లు మనీష్, కె. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వూషూ క్రీడాకారిణికి అభినందన



వూషూ క్రీడాకారిణిని అభినందిస్తున్న కరస్పాండెంట్ కోన సతీష్

నర్సీపట్నం:రాష్ట్రస్థాయి వూషూ పోటీల్లో రిషీ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న విద్యార్థిని కరణం జాహ్నవి రజిత పతకం సాధించింది. అండర్-19 విభాగంలో ప్రతిభ కనబరిచి కళాశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చింది. కళాశాల కరస్పాండెంట్ కోన సతీష్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్‌లు భాస్కర్, టి.వి.ఎన్.ఎల్. రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛంద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



లచ్చన్నపాలెంలో వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: రైతులు స్వచ్ఛంద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ రబీ సీజన్ నుంచి స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్టు చెప్పారు. అకాల వర్షాలు, వాతావరణంలో అధిక తేమశాతం, ఉష్ణోగ్రతల వల్ల పంటలు నష్టపోతే బీమా అందుతుందన్నారు. దీనికిగాను ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. అనంతరం క్షేత్ర పర్యటనలో భాగంగా వరిపంటను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి శిరీష, వ్యవసాయ, సేంద్రియసాగు విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరుకాక విద్యార్థులకు ఇక్కట్లు



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: ఫీజులు కట్టలేక... పరీక్షలు రాయలేని స్థితిలో విద్యార్థులున్నారని, వెంటనే స్కాలర్ షిప్ సొమ్ము విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడం వల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫీజులు కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని యాజమాన్యాలు అంటున్నాయని చెప్పారు. పరీక్షలు కూడా రాయలేని పరిస్థితుల్లో విద్యార్థులు ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏవోను కలిసిన వారులో డివిజన్ సభ్యులు వరహాలు, విష్ణు, రవి, గణేష్, మహేంద్ర,రాము,రవి,గీతాకృష్ణ ఉన్నారు.

ఇరుకు గదుల్లో పశువైద్య కేంద్రం



రోడ్డు పక్కన పశువైద్య పరీక్షలను చేస్తున్న సిబ్బంది



ఇరుకుగా ఉన్న పశువైద్య కేంద్రంలో ఓ గది



అసంపూర్తిగా నిలిచిన భవనం

- అరకొర వసతులతో అవస్థలు
- 11 ఏళ్లగా అసంపూర్తిగా నిలిచిపోయిన సొంత భవన నిర్మాణం

కె.కోటపాడు : మండలంలోని కొరువాడలో గల పశువైద్య కేంద్రానికి ఇప్పటికీ సొంత భవనం సమకూరకపోవడంతో అరకొర వసతుల నడుమ పశువైద్యం చేయవలసి వస్తోంది. ఇక్కడి గ్రామీణ పశువైద్య కేంద్రాన్ని 2013లో పశువైద్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి సత్యసాయి మందిరంలో గల రెండు చిన్నపాటి గదుల్లోనే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ గదుల్లోనే కార్యాలయ రికార్డులను భద్రపర్చుకునేందుకు బీరువాలు, స్టేషనరీతో పాటు పశువులకు సంబంధించిన మందులు, రైతులకు రాయితీపై అందించేందుకు వచ్చే గడ్డి విత్తనాలను ఉంచడం వల్ల స్థలాభావ సమస్యతో సిబ్బంది తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. భవనం ఎదుట గల సీసీ రోడ్డుకు పక్కన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించవలసి వస్తోంది. కొరువాడ పశువైద్య కేంద్రం పరిధిలో 14గ్రామాల్లో గల ఏడు వేల ఆవులు, గేదెలు, పదివేల గొర్రెలు, మేకలకు పశువైద్య సేవలు అందుతున్నాయి. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో గల పశువైద్య సహాయకులతో సమావేశాలను నిర్వహించుకునేందుకు కూడా వసతి సమస్య వేధిస్తోంది.

అసంపూర్తిగా భవనం

కొరువాడలో పశువైద్య కేంద్రానికి సొంతభవనం సమకూర్చేందుకు 2013లో రూ.5.57లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. భవన నిర్మాణం పూర్తికి అదనపు నిధులు మంజూరు కావాల్సి ఉన్నా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో 11 ఏళ్లగా భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

నిర్మాణాన్ని పూర్తి చేయాలి



కొరువాడలో పశువైద్య కేంద్రం భవన నిర్మాణం ప్రారంభించి 11 ఏళ్లు అయింది. ఈ నిర్మాణానికి అదనపు నిధులు కేటాయిస్తే పనులు పూర్తవుతాయి. పశువైద్య కేంద్రానికి సొంత భవనం సమకూరితే మరింత మెరుగైన పశువైద్యం అందుబాటులోకి వస్తుంది

–ఈర్లి దేముడు, పాడి రైతు, కొరువాడ

ఉన్నతాధికారుల దృష్టికి భవన సమస్య



అసంపూర్తి భవన నిర్మాణ సమస్యను ఇప్పటికే పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. చిన్న గదుల్లో ఆస్పత్రి నిర్వహించడం వల్ల ఇక్కట్లకు గురవుతున్నాం. సొంత భవన నిర్మాణం పూర్తయితే పశువైద్య సేవలు మరింతగా మెరుగ్గా పాడి రైతులకు అందుతాయి.

–సీహెచ్.వై.నాయుడు, పశువైద్యాధికారి, కొరువాడ



నర్సీపట్నంలో శాంతియుత ధర్నాకు పార్టీ నాయకులతో కలిసి బైక్‌పై వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

మాకవరపాలెంలో 40 మంది వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టు



మాకవరపాలెం స్టేషన్‌లో రుత్తల యర్రాపాత్రుడు, తదితరులు



చంద్రయ్యపాలెం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

మాకవరపాలెం: నర్సీపట్నంలో శాంతియుత ర్యాలీకి బయలుదేరిన 40 మంది వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నర్సీపట్నం రూరల్ సీఐ వైఖరికి నిరసనగా బుధవారం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ చేపట్టిన శాంతియుత ర్యాలీకి మద్దతుగా వీరు నర్సీపట్నం బయలుదేరారు. చంద్రయ్యపాలెం జంక్షన్ వద్ద ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పోలీసులు వాహనాలను తనిఖీ చేసి వైఎస్సార్‌సీపీ నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరిలో పార్టీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, మాజీ స్టేట్ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, నేతలు రుత్తల నాయుడు, బొడ్డు నాయుడు, సర్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

గొలుగొండ: నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేపట్టిన శాంతియుత ర్యాలీ, ధర్నాకు గొలుగొండ మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. చీడిగుమ్మల, గుండిపాల, రావణాపల్లి వద్ద పోలీసులు బలగాలు కాపుకాసి నాయకులు వెళ్లకుండా అడ్డుకున్నాయి. సీఐ రేవతమ్మ వైఖరిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి నాయకుల శాంతియుత ర్యాలీకి వెళుతున్న సమయంలో పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు. ఉదయం జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, మండల యూత్‌పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడును చీడిగుమ్మలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూర్యాలీకి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు.

నాతవరంలో..

నాతవరం: నర్సీపట్నంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తలపెట్టిన శాంతియుత ఆందోళనకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయుకులను నాతవరం పోలీసులు అడుగడునా అడ్డుకున్నారు. నాతవరం మండలం నుంచి బయలుదేరిన ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తితో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు నర్సీపట్నం, తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డులో తాండవ జంక్షన్, డి.యర్రవరం జంక్షన్‌లలో పోలీసులు అడ్డుకున్నారు. ధర్నా విజయ వంతంకాకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తదితరులు ఆరోపించారు. ఈవిషయంపై నాతవరం ఎస్ఐ సీహెచ్.భీమరాజుని వివరణ కోరగా ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు.



చీడిగమ్మలలో తనిఖీలు నిర్వహిస్తున్న గొలుగొండ పోలీసులతో పాటు ప్రత్యేక పోలీస్ సిబ్బంది



పోలీసుల ఆంక్షలతో చీడిగుమ్మలలో ఇంటి వద్దే ఉన్న గొలుగొండ జెడ్పీటీసీ, ఇతర నాయకులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు



దిబ్బిడిలో మంచినీటి బోరు పనులను ప్రారంభించిన జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు నుంచి దిబ్బిడిలో చిన్ని వారి కళ్లాల వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆయన బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఇదే కళ్లాల వద్ద మరో మంచినీటి బోరును మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా,అమ్మ ఒడి తదితర పథకాలను అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొంపా చినబాబు,సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం రైతు సంఘ నాయకులు చిన్ని పైడిరాజు,రాజు,పెదిర్లై శ్రీను,అద్దెపల్లి రామారావు,జొన్నపల్లి అప్పారావు,సియాద్రి నాయుడు,సేనాపతి వెంకట అప్పారావు, జెర్రిపోతుల చిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

దేవరాపల్లి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ హాజరవుతారని ఏవో చెప్పారు.

రోలుగుంట: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచారహక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఈ సదస్సును రైతులుసద్వినియోగం చేసుకోవాలనిఆమె కోరారు.

వరిలో పొటాష్ లోపం

చోడవరం రూరల్: వరిపంటలో పొటాష్ లోపం ఉన్నట్టు తాము గమనించామని, రైతులు తక్షణం నివారణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి డీఆర్‌సీ వి.తులసీమణి తెలిపారు. మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటకు పాచి తెగులు ఆశించిందని, అదే రీతిలో ఆకుముడత కూడా ఉందన్నారు. ముళ్ళకంపను పంటపైన ఈడ్చడం ద్వారా ఆకు ముడతను నివారించవచ్చని ఆమె అన్నారు. జీడిమామిడి పంటకు పంటలభీమా వర్తిస్తుందని, ఎంత విస్తీర్ణానికి బీమా చేయవచ్చన్నది వివరించారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సలహా సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఇ.పావని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయాధికారి ఏ.ఉమా మహేశ్వరి, ఏహెచ్ఏ పి.వి.ఎం.నాయుడు, రైతులు పాల్గొన్నారు.

మాజీ వలంటీర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వేచలం గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ బడబల్ల సన్యాసమ్మ సంతాప సభ బుధవారం స్వగ్రామంలో జరిగింది. ఆమె ఇటీవల గుండెపోటుతో ఆమె మృతి చెందింది. సంతాపసభలో ఆమె చిత్రపటం వద్ద మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు నివాళులర్పించారు. ఆమె భర్త నాయుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు, వేచలపు చిన్నంనాయుడు, స్థానిక గ్రామ పెద్దలు, నాయకులు సంతాపం తెలిపారు.

మాజీ మంత్రి సత్యం మాస్టారు మృతి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసి మాడుగుల నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధిచేసిన రెడ్డి సత్యనారాయణ (సత్యం మాస్టారు)ఎప్పటికీ ప్రజల హృదయాల్లో ఉంటారని చెప్పారు. కొంతకాలం వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక నాయకుడుగా పనిచేసిన మాడుగుల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధిచేశారన్నారు. సత్యం మాస్టారు ఆత్మకుశాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్టు ధర్మశ్రీ చెప్పారు.

పెద్దేరు నీటిమట్టం తగ్గుముఖం

మాడుగుల: పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం జలాశయంలోకి 120 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 135 మీటర్లు ఉంది. పంట కాలువలకు 140 క్యూసెక్కుల నీరు విడుదల చేయడం వల్ల సాగుకు ఢోకాలేదని అధికారులు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థి మర్రి గిరీష్ కుమార్, ఎంఈవో జగ్గారావు



ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేస్తున్న అల్లాడ సురేష్‌కుమార్

రోలుగుంట: ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ మర్రి గిరీష్ కుమార్ అన్నారు. ఈ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో టెన్త్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన అన్సార్ కరీం, చాణిక్య అనే ఇద్దరు విద్యార్థులకు ప్రోత్సాహకంగా బుధవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిర్మాణాత్మకంగా చదువుకోవాలన్నారు. కష్టపడి చదివితే ఏదీ అసాధ్యం కాదన్నారు. అనంతరం గిరీష్ కుమార్‌ను ఎంఈవో జగ్గారావు, హెచ్ఎం ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయుడు శర్మ, రామశేషు తదితరులు సన్మానించారు.

నర్సీపట్నం: టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి)కు చెందిన ముగ్గురు విద్యార్థినులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, పాఠశాల పూర్వ విద్యార్థి అల్లాడ సురేష్ కుమార్ నగదు అందజేశారు. 558 మార్కులు సాధించిన పూడి సాయి హర్షిణి, నమ్మి హైమావతిలకు రూ.3,500 చొప్పున, 555 మార్కులు సాధించిన వారణాసి నవ్యకు రూ.3 వేల నగదు, జ్ఞాపికలను హెచ్ఎం కె.వి.రమణ చేతుల మీదుగా అందజేసి, అభినందించారు. వాచ్‌మన్ రూమ్ మరమ్మతులు నిమిత్తం రూ.6,500 నగదును పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. స్థానిక దుర్గాలమ్మ ఆలయం వెనుక భాగంలో రూ.1.50 కోట్లతో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు స్వామి, పడాల అప్పలనాయుడు శివ, గ్రామానికి చెందిన అప్పాన వెంకటరమణ, అప్పాన భాస్కరావు, గెంజి రాజేశ్‌కుమార్, మజ్జి విశ్వనాథం, గొల్లవిల్లి రాజేశ్, తో పాటు గ్రామంలో గల అయ్యప్ప, శివ స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం



వారాడలో రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ భాగ్యావతి



గుర్రంపేట గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



సంగ్యాంలో మాట్లాడుతున్న రీసర్వే డీటీ గణపతిరావు

కె.కోటపాడు : గ్రామసభల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ భాగ్యావతి తెలిపారు. వారాడ గ్రామంలో బుధవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాలలో పేర్లు నమోదులో తప్పులు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, భూమి స్వభావంలో తప్పులు సరి చేయాలని 37 మంది తహసీల్దార్‌కు అర్జీలను అందించారు. అర్జీదారుల సమస్యలను రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి 15 రోజుల్లోగా పరిష్కారం చూపనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వెంకటరావు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ చిరికి గోవింద పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

రోలుగుంట: గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎస్.నాగమ్మ తెలిపారు. గుర్రంపేటలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, ఆర్ఐ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: గ్రామ సభల్లో రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను 15 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని మండల రీసర్వే డీటీ కె.గణపతిరావు తెలిపారు. అవురువాడ పంచాయతీ సంగ్యాం రెవెన్యూ పరిధిలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి ఆరు అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కోటి స్థానిక నాయకులు బన్నీ, కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో మంగళవారం రాత్రి గౌరీపరమేశ్వరులను ప్రతిష్ఠించారు. ప్రతి ఏటా మాదిరిగా నాగులచవితి నాడు గ్రామంలో గౌరీపరమేశ్వర్లను నెలకొల్పి నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజులు జరిపి, పౌర్ణమి తర్వాత నిమజ్జనం చేస్తారు. ఈ నేపథ్యంలో గౌరీపరమేశ్వర విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక భజనలు, మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో గౌరీ పరమేశ్వర్లను ప్రతిష్ఠించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

గొలుగొండ/నాతవరం: జీడి తోటలు సాగు చేస్తున్న రైతులు పంట బీమా చేయించుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఉద్యానవనశాఖ అధికారిణి ఎస్.శిరీషా తెలిపారు. గొలుగొండ మండలం పెసరాడ, నాతవరం మండలం నాతవరం,మర్రిపాలెం గ్రామాల్లో బుధవారం ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం జరిగితే స్వచ్ఛంద బీమా ఉన్న వారికి ఎకరానికి రూ. 30,800 వరకు నష్ట పరిహారం వస్తుందని తెలిపారు. ఈనెల 15లోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.